ప్రజాశక్తి

శుక్రవారం 26 జనవరి 2024 8 పేజీలు





గుంటూరు పల్నాడు

సాగును బాగు చేసుకునేందుకు పోరు

సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్త ఆందోళన - గుంటూరు,పల్నాడు జిల్లాల్లో నేడు ట్రాక్టర్, బైక్ ర్యాలీలు



గతేడాది గుంటూరులో ట్రాక్టర్ ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ ఐక్య వేదిక పిలుపు మేరకు శుక్రవారం దేశ వ్యాప్తంగా రైతులు ర్యాలీలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా గుంటూరు, నర్సరావుపేట, తాడేపల్లిలో ట్రాక్టర్‌లు, బైక్ ర్యాలీలు జరగనున్నాయి. గుంటూరులో బిఆర్ స్టేడియం నుంచి చుట్టుగుంట వరకు, నర్సరావుపేటలో మార్కెట్ యార్డు నుంచి ఆర్‌డివో కార్యాలయం వరకు, తాడేపల్లి మండలం పాతూరు నుంచి ఉండవల్లి వరకు ర్యాలీలు నిర్వహించనున్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన రైతు సంఘాలు, కౌలు రైతు సంఘాలతో పాటు వ్యవసాయ కార్మికులు ర్యాలీల్లో పాల్గొననున్నారు.

వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభాలను తొలగించేందుకు రైతులను ఆదుకునేందుకు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్నిపంటలకుపెట్టుబడిపై అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్ చేసింది. ఈ అంశంలో కేరళలో ఉన్న మద్దతు ధరను అమలు చేయాలని కోరారు. రైతులకు రుణాలమాఫీ, రుణ ఉపశమన చట్టం చేయాలని, సమగ్ర పంటల బీమా అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని తదితర డిమాండ్లతో మూడు ప్రాంతాల్లో ర్యాలీలు జరగనున్నాయి.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేయరాదని, కడప ఉక్కు నిర్మించాలని, విద్యుత్ చట్టసవరణ బిల్లు ఉపసంహరించాలని, స్మార్టు మీటర్ల బిగింపును నిలిపివేయాలని, భూహక్కుల చట్టం ఉపసంహరించాలని, పోలవరం నిర్వాసితులకు తక్షణం పునరావసం, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో రైతులు,కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు పలుసమస్యలు ఎదుర్కొంటున్నారు. మిర్చి తప్ప మిగిలిన పంటలకు మద్దతు ధరలు లభించడం లేదు. వరి, పత్తి, మిర్చి, శనగ, అపరాలు, జొన్న, మొక్కజొన్న, పసుపు, సోయాబీన్ తదితర పంటలను సాగు చేస్తున్నారు. పెట్టుబడులు పెరుగు తున్నాయి. ధరలు అమ్మబోతే అడవి, కొనబోతే కొరవి చందంగా మారుతున్నాయి. రైతుల వద్ద ఉత్పత్తులు కొనుగోలు సమయంలో ధరలను గణనీయంగా తగ్గించడం, కొద్ది రోజుల తరువాత ధరలను పెంచడం వ్యాపారులు, దళారీలకు పరిపాటిగా మారింది. ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా ఉత్పత్తుల కొనుగోలులో పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా ఉత్పత్తులు విక్రయించినట్టు రికార్డులో నమోదు చేస్తున్నా క్షేత్రస్థాయిలో వ్యాపారులే కొనుగోలు చేసి రైతుల పేరున ఆర్‌బికేల్లో కొన్నట్టు రికార్డు చేస్తున్నారు. పత్తి కొనుగోలు కూడా సిసిఐ కేంద్రాలు నామమాత్రంగా మారాయి. దళారీలదే రాజ్యంగా కొనుగోలు సాగుతోంది. తేమ శాతం ఎక్కువగా ఉందని, నాణ్యత లేదనే వంకలుపెట్టి ఇళ్ల వద్దనే పత్తిని కొనుగోలు చేయడం పరిపాటింది. కానీ రైతులపేరున

▸ 2లో



వెలగపూడిలో అమరావతి రైతుల సమర శంఖారావం సభలో మాట్లాడుతున్న సిహెచ్ బాబురావు

రాజధాని విషయంలో బిజెపి, వైసిపి ముద్దాయిలే

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలి
- మహిళల పోరాటం స్ఫూర్తిదాయకం
- అమరావతి రైతుల సమర శంఖారావం సభలో వక్తలు
- రాజధానిలో 1500వ రోజు వినూత్న కార్యక్రమాలు

వార్త మెయిన్‌లో

మిర్చి యార్డుకు భారీగా సరుకు



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా:ప్రతినిధి

గుంటూరు మిర్చి యార్డుకు గురువారం రైతులు టిక్కీలను భారీగా తీసుకువచ్చారు. వరుసగా మూడు రోజుల సెలవులు కావడంతో భారీగా సరుకు వచ్చిందని అధికారులు తెలిపారు. కర్నూలు, ప్రకాశం, పల్నాడు, కృష్ణా, నంద్యాల జిల్లాల నుంచి ఎక్కువగా సరకు వస్తోంది. వివిధ ప్రాంతాల నుంచి గురువారం 1,14,103 టిక్కీలు రాగా పాత నిల్వలతో కలిపి 1,19,090 టిక్కీలు అమ్ముడుపోయాయి. ఇంకా 59,352 టిక్కీలు నిల్వ ఉన్నాయి. మూడు రోజులుగా నిత్యం లక్ష టిక్కిల వరకు వస్తున్నాయి. ఒకేసారి ఎక్కువ టిక్కిలు రావడంతో యార్డు ప్రాంగణం అంతా కిటికిటలాడింది. గత వారం కంటే ఈ వారం ధరలు మరింత తగ్గాయి. సాధారణ రకాలు ధర క్వింటాళ్ కనిష్ట ధర రూ.8 వేలు, గరిష్ట ధర రూ.20 వేలు పలికింది. మేలు రకాల సరుకు కూడా ధరలు తక్కువగానే నమోదయ్యాయి. ప్రధానంగా తేజ, బాడిగ రకాలు కనిష్ట ధర రూ.8 వేలు, గరిష్ట ధర రూ.20,500కు పలికాయి. గత వారం కంటే ఈ వారం ప్రతి వెరైటీకి క్వింటాళ్‌కు రూ. 2వేల వరకు తగ్గాయి.

క్రమంగా కోల్డ్ స్టోరేజీ సరుకు రావడం బాగాతగ్గింది. కొత్త సరుకు కోల్డ్ స్టోరేజిల్లో ఉంచుతున్నారు. ధరల ఆశించినంత లేకపోవడం వల్లరైతులు నిరాశకు గురయ్యారు. గతేడాది ఇదేరోజుల్లో గరిష్ట ధర రూ.20 నుంచి 24 వేల వరకు వచ్చింది. గత నెల రోజుల్లో ధరల పతనం కొనసాగుతోంది. సరుకు ఎక్కువగా వస్తుండటంతో వ్యాపారులు ధరలను క్రమంగా తగ్గిస్తున్నారు. తేమ శాతం ఎక్కువగా ఉందని, ఆరబెట్టుకుని తీసుకురమ్మని షరతు విధిస్తున్నారు. ఎండ తీవ్రత లేకపోవడం వల్ల కల్లాల్లో ఆరబెట్టుకోవడం రైతులకు ఇబ్బందిగా ఉంది. యార్డులో కూడా ఆరబోసి ఎండబెట్టుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు అయినకాడికి అమ్ముకుంటున్నారు. గుంటూరుకు సమీప ప్రాంతాల వారు మాత్రం ఒకటి రోజులు ఆరబెట్టుకుని యార్డులోనే నిద్రించి సరుకు అమ్మిన తరువాత స్వస్థలాలకు వెళ్తున్నారు. బాగా ఆరబెట్టిన కాయలు కోల్డ్ స్టోరోజిల్లోనే నిల్వ చేస్తున్నారు.

వార్తలు లోపలి పేజీల్లో



గుంటూరులో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి



నరసరావుపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎల్.శివశంకర్

నామినేషన్ ప్రక్రియ వరకూ ఓటు నమోదుకు అవకాశం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవాలు



గోళ్లపాడు కార్యదర్శికి ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

14 వజాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బూత్ లెవల్ అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇందులో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ నుండి ప్రశాంసా పత్రాన్ని గోళ్లపాడు పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌భార్గవ్ అందుకున్నారు. ఆయనకు తహశీల్దార్ భవానీశంకర్, ఎంపిడిఒ పుట్టారెడ్డి, సర్పంచ్ జి.అప్పమ్మ, రెవెన్యూ సిబ్బంది, మండల పరిషత్తు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.



ఉత్తమ బిఎల్ఒ అవార్డును అందుకున్న నాసరరెడ్డి

ప్రజాశక్తి - రెంటచింతల

మండలంలోని గోలి గ్రామంలో వీఆర్వోగా పనిచేస్తున్న పాశం నాసరరెడ్డి పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ నుండి ఉత్తమ బిఎల్ఓగా అవార్డును అందుకున్నారు. ఆయన్ను తహశీల్దార్ పుల్లారావు, ఆర్ఐ కాంతారావు, విఆర్ఓ రామకృష్ణ, పాపారావు అభినందించారు.

ధరణికోట వెల్ఫేర్ అసిస్టెంట్ శ్యామ్‌కు అవార్డు

ప్రజాశక్తి - అమరావతి



జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట టౌన్ హాల్లో గురువారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో ఉత్తమ బిఎల్వోగా ధరణికోట గ్రామ సచివాలయం-1 సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ శ్యామ్‌కు అవార్డును అందుకున్నారు. కలెక్టర్ ఎల్.శివశంకర్ నుండి రపశాంసా పత్రాన్ని అందుకున్న ఆయన్ను సర్పంచ్ మాదాసు పావని, వైసిపి నాయకులు కె.కోటేశ్వరరావు, ఎం.రాంబాబు, కార్యదర్శి వెంకటాద్రి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - తెనాలి

ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి గయానుద్దౌలా డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల పై గురువారం మండల వనరుల కేంద్రం వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. గయానుద్దౌలా మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులను ప్రభుత్వంలో విలీనం చేసిన నేపథ్యంలో వారి సర్వీస్ రూల్స్, బదిలీలు, పదోన్నతుల వంటి అంశాలపై పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోలేదన్నారు. సమస్యలపై ఆందోళనకు విజయవాడలో ధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో అనుమతిని కూడా ప్రభుత్వం నిరాకరించిందన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.సాంబశివరావు, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ బసవేశ్వర రావు, పట్టణ శాఖ అధ్యక్ష కార్యదర్శులు పి సౌజన్య, డి ప్రదీప్ చంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



'పొలం వివాదానికి ఎమ్మెల్యేకు సంబంధం లేదు'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



స్థలాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులుకాజేయలని చూస్తున్నారని, తనకు ప్రాణహాని ఉందని గునపాటి వెంకటేశ్వరరెడ్డి మంగళవారం చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఆరోపణలు ఎదుర్కొంటున్న వంపుగుడి జాన్ అన్నారు. ఈ మేరకు సంబంధిత స్థలంలో దళిత సంఘాల నాయకులతో కలిసి గురువారం విలేకర్లతో మాట్లాడారు. 2019లో ఫిరంగిపురానికి చెందిన ఆవుల సాంబశివరావు వద్ద 82 సెంట్లను కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకొని కొంత నగదు చెల్లించి స్వాధీనం చేసుకున్నామని, రిజిస్ట్రేషన్‌కు ఆలస్యం అయినప్పటికీ సాంబశివరావుకు తనకు మధ్య ఉన్న ఒప్పందం మేరకు మిగిలిన డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చూసుకుంటానని చెప్పారు. 2015లో వెంకటేశ్వరరెడ్డి, సాంబశివరావు బంధువుల వద్ద 41 సెంట్ల స్థలం కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారని ఆరోపించారు. స్థలం వివాదంలో ఎమ్మెల్యేకు సంబంధం ఉందని వెంకటేశ్వరరెడ్డి మాట్లాడడం తగదన్నారు. ఆయనపై పరువునష్టం దావా వేస్తామన్నారు. స్థల వివాదంలో నిజా నిజాలు బయటకు రావాలంటే ఆధారాలతో రెవెన్యూ అధికారుల వద్దకు రావాలని సవాలు విసిరారు. జాన్‌కు మద్దతు తెలిపిన రొంపిచర్ల ఎంపిపి గడ్డం వెంకట్రావు, దళిత సంఘాల నాయకులు అన్నవరపు కిషోర్‌లు మాట్లాడుతూ దళితులు ఆర్థికంగా ఎదగడం ఇష్టం లేకే వెంకటేశ్వరరెడ్డి ఇలా చేస్తున్నారని అన్నారు.

అట్టహాసంగా వాగ్దేవి జూనియర్ కాలేజీ వార్షికోత్సవం



మాట్లాడుతున్న కళాశాల కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యార్థి జీవితంలో కళాశాల సమయం ఎంతో ముఖ్యమైందని, కళాశాలలో గడిపిన క్షణాలు జీవితాంతం గుర్తుండిపోతాయని వాగ్దేవి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అన్నారు. నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో వాగ్దేవి జూనియర్ కళాశాల 12వ వార్షికోత్సవాలు గురువారం అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పల్నాడు జిల్లా ఫారెస్ట్ అధికారి ఎన్.రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే మంచి నడవడిక, స్నేహాలు, అలవాట్లు ఏర్పరుచుకోవాలని తీసుకునే నిర్ణయాన్ని బట్టి విద్యార్థుల దశ మారుతుందన్నారు. కళాశాల సెక్రటరీ - కరెస్పాండంట్ రాయల శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్ష్యం నిర్దేశించుకొని లక్ష్య సాధనకు కఠోర శ్రమ చేయాని చెప్పారు. తమ కళాశాలలోని విద్యార్థులు ఎంతో క్రమశిక్షణ కలిగి ఉన్నారని, అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యా బోధనతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. విద్యార్థులకు మంచి జీవితం ఇచ్చేందుకు ఎంతో తపన పడుతున్న తల్లిదండ్రులే విద్యార్థులకు నిజమైన హీరోలని అన్నారు. గొప్పవారి జీవిత చరిత్రలు చదవడం ద్వారా యువత ఆలోచన విధానంలో మార్పు వస్తుందని, మంచి పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. అనంతరం విద్యలో, క్రీడలలో రాణించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు, డైరెక్టర్‌లు కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, పాశం కృష్ణారావు, పోటు అచ్యుతరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సాగును బాగు చేసుకునేందుకు పోరు

(మొదటి పేజీ తరువాయి)

రికార్డు చేసి సిసిఐ అధికారులు, వ్యాపారులు కమిషన్లుపొందుతుంటారు. మిర్చి కూడా ఎక్కువగా మిర్చి యార్డుకు వస్తున్నా 40 శాతం వరకు సీజన్‌లో వ్యాపారులు కల్లాల్లోనే రొక్కం ప్రాతిపదికన కొనుగోలు చేస్తుంటారు. వ్యవసాయంలో గిట్టుబాటు ధరల లభించక ఎక్కువ మంది రైతులు సాగుకు దూరం అవుతున్నారు. అవకాశం ఉన్న వారు కౌలుకి ఇవ్వడం, లేదంటే రియల్ ఎస్టేట్‌కు వినియోగించడం, అదీ కాదంటే భూములను అమ్ముకోవడానికి సిద్ధపడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్త15 లక్షల ఎకరాల సాగు భూమిఉండగా గత ఖరీఫ్ సీజన్‌లో మూడున్నర లక్షల ఎకరాలు భూమి ఖాళీగా ఉంది. దీని వల్ల ఎంతో మంది వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. మరోవైపు కౌలు రైతులకు కూడా వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. కౌలు ధరలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి తగిన చేయూత కొరవడింది. రైతు భరోసా కౌలు రైతులందరీకి దక్కడం లేదు. రుణాలు అందడం లేదు. తీవ్ర సంక్షోభంలో ఉన్నారు. జిల్లాలో గత 10 ఏళ్లలో దాదాపు లక్షన్నర ఎకరాల భూమిని వ్యవసాయంనుంచి వ్యవసాయేతర రంగాలకు మళ్లించారు. వ్యవసాయాన్ని కాపాడుకునేందుకు రైతులంతా సంఘటితం కావాలని రైతుసంఘం నాయకులు కోరుతున్నారు.

ప్రజలకు సంకటంగా స్థిరాస్థి చట్టం

కేంద్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆమోదించిన స్థిరాస్తి హక్కు చట్టం రద్దుచేయాలని రైతుసంఘాలు కోరుతున్నాయి. దీని వల్ల ప్రజలకు ఎంతో నష్టం జరుగుతుందని చెబుతున్నారు. ఈ చట్టం లో, వివాదాల పరిష్కారానికి హైకోర్టు కిందిస్థాయి కోర్టుల కెళ్లే అవకాశాన్ని ఇవ్వకపోవడం, రెవిన్యూ సిబ్బంది అన్ని టైటిల్స్ వ్యవహారాలు చూడడం వల్ల అవినీతి పెరిగి సామాన్యులు తమ భూములు కాపాడుకోవడం కష్టం అవుతుందన్నారు. నూతన స్థిరాస్తిహక్కు చట్టం వల్ల ఆన్‌లైన్‌లో చిన్న పొరపాటు జరిగినా భూ యజమానులు ఎంతో ఇబ్బంది పడే ప్రమాదం ఉందన్నారు. దీని వల్ల సమాజంలో స్థిరాస్తుల వివాదాలు పెరిగిపోతాయని సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది.

'టిడిపి అధికారంలోకి వస్తే బీసీలకు మళ్లీ పెద్దపీట'

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్



గతంలో టిడిపి ప్రభుత్వం బీసీలకు ఎన్నో రాయితీలు, రుణాలు ఇస్తే వాటిని వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందని టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి.రామాంజనేయులు, టిడిపి బీసీ సెల్ జిల్లా నాయకులు శ్రీనివాసరావు అన్నారు. పెదనందిపాడులో గురువారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం బీసీలను అణగదొక్కుతోందని మండిపడ్డారు. టిడిపి అధికారంలోకి వచ్చాక బీసీలకు ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని చెప్పారు. రామాంజనేయులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని, చంద్రబాబును సిఎంను చేద్దామని చెప్పారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆర్.శివరామకష్ణయ్య, ఎన్.బాలకృష్ణ, వి.సుబ్బారావు, టిడిపి, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.విజయలక్ష్మి

మట్టిలో కలిసిపోయే మన అవయవాలను దానం చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మృతి చెందాక మట్టిలో కలిసిపోయే అవయవాలను ప్రతిఒక్కరూ మానవతా దక్పథంతో అవయవదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో కలెక్టర్ కార్యాలయంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్పందన హాలులో గురువారం అవగాహన సదస్సును ఉజ్వల భారతి మహిళా శక్తి సేవా సంఘం జాతీయ అధ్యక్షులు ఎం.విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. అవయవదానం గురించి డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రవి వివరించారు. ఆసక్తి కలిగిన కొందరు అవయవాదానం చేస్తామని ముందుకొచ్చారని చెప్పారు. వి.నాగరాజుకుమారి, ఎం.చైతన్య దీప్తి, వేణుకాదేవి, పి.సౌలు బుజ్జి, ఎం.జయమ్మ పాల్గొన్నారు.



తైక్వాండోలో ఎస్ఎస్ అండ్ ఎన్ కాలేజీ విద్యార్థినులకు పతకాలు

ప్రజాశక్తి - నరసరావుపేట

నంద్యాల పద్మావతి నగర్‌లో ఈనెల 20, 21 తేదీల్లో జరిగిన ఫస్ట్ ఓపెన్ స్టేట్ ఉమెన్స్ క్యోరుగి తైక్వాండో ఛాంపియన్షిప్‌లో నరసరావుపేట ఎస్ఎస్ అండ్ ఎన్ కాలేజీ విద్యార్థినులు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధించారని కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపాలవాయి విజయకుమార్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాగుప్తా గురువారం తెలిపారు. సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఎంఎం అంజని సాయి లక్ష్మి అండర్-46 కిలోల విభాగంలో కేటగిరిలో రజత పథకం సాధించి చత్తీస్‌ఘడ్‌లో జరగబోయే జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. జూనియర్ ఇంటర్ విద్యార్థిని వి.తులసి తన్మె అండర్-53 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించినట్లు ప్రిన్సిపల్ సోము మల్లయ్య చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ అధ్యాపకులు మధుసూదన్‌రావు, అధ్యాపకులు సుధీర్, ఎవిఎన్ గుప్తా పాల్గొన్నారు.

క్రాస్‌కంట్రీ జాతీయ స్థాయి పోటీలకు కృష్ణవేణి డిక్రగీ కాలేజీ విద్యార్థినలు

ప్రజాశక్తి - నరసరావుపేట

బాపట్ల జిల్లా ఖాజీపాలెంలోని కెవిఆర్ అండ్ ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 24న జరిగిన పురుషుల-మహిళల క్రాస్ కంట్రీ పోటీల్లో నరసరావుపేటలో స్థానిక కృష్ణవేణి డిగ్రీ కాలేజీ మహిళల జట్టు రన్నరప్‌గా నిలిచిందని కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మహిళా జట్టుకు తమ కళాశాలకు చెందిన ఎం.శిరీష, ఎం.హేమలత, కె.విశాలాక్షి, స్టాండ్ బైగా బి.అలేఖ్య ఎంపికయ్యారని కళాశాల పీడీ ఈదర ఆదిబాబు, కోడ్ మహ్మద్ తెలిపారు. ఈ జట్టు ఫిబ్రవరి 10వ తేదీ మహారాష్ట్రలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ క్రాస్ కంట్రీ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఈ పోటీలకు అర్హత సాధించిన వారిని అభినందించారు.



నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల నివారణ

రోడ్డు భద్రతా మాసోత్సవాల సభలో ఎఎస్‌పి రవిచంద్ర సూచన

ప్రజాశక్తి మంగళగిరి :రోడ్డు భద్రత నిబంధనలు పాటించటం ద్వారా ప్రమాదాలు తగ్గించవచ్చని అక్టోపస్ ఏ ఎస్ పి రవిచంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రవాణా శాఖ 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు సందర్భంగా గురువారం మంగళగిరి పట్టణంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద విద్యార్థులు ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించాలని ప్రతి ఏడాది రవాణా శాఖ ఆధ్వర్యంలో 24వ తేదీ నుండి ఫిబ్రవరి 19 వరకు భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ ఎక్కువగా విద్యార్థులు, యువకులు నిత్యం రోడ్డుపైన తిరుగుతారని వాహనాలు నడుపుతున్న సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. గుంటూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో 90 శాతం మానవ తప్పిదాల వలన ప్రమాదాలు జరుగుతున్నాయి అన్నారు. ఈ ప్రమాదాలలో మత్యువాత పడుతున్న వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరు వాహనం నడిపే సమయంలో ఏకాగ్రతతో ఉంటూ రోడ్డు రవాణా శాఖ ఏర్పాటు చేసిన సిగ్నల్స్ పాటించాలని కోరారు. ప్రత్యేకించి విద్యార్థులు యువత అతివేగంగా వాహనాలు నడపవద్దని సెల్ ఫోన్ మాట్లాడవద్దని కరీం సూచించారు. ప్రైవేటు వాహనాల్లో అధికంగా ప్రయాణికులకు ఎక్కిస్తున్నారని దీనివలన ప్రమాదాలు దొరుకుతాయని డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముందుగా పాత బస్టాండ్ సమీపంలో విద్యార్థులు ఆటో డ్రైవర్లు రావణ శాఖ సంబంధించిన ప్లే కార్డులతో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెనాలి, మంగళగిరి, గుంటూరు మోటారు వాహనాల తనిఖీ అధికారులు టి రాఘవరావు, విజయ సారథి, అనిల్ కుమార్, ఆర్టీవో మనోహర్ ప్రసంగించారు. కార్యక్రమంలో నగరం లోని వివిధ కళాశాల చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తెనాలిరూరల్

ఎపిఎస్‌ఆర్టిసి తెనాలి డిపోలో జరుగుతున్న భద్రత వారోత్సవాల్లో భాగంగా తెనాలి మోర్టర్ వెహికల్ ఇన్స్పెక్టర్ టి రాఘవరావు గురువారం తెనాలి డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా తెనాలి డిపో డ్రైవర్లు, కండక్టర్లు ,మెకానిక్ సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు.



తెనాలిలో మాట్లాడుతున్న ఎంవిఐ రాఘవరావు



మంగళగిరిలో ర్యాలీ

కార్యక్రమంలో రాఘవరావు మాట్లాడుతూ తోటి వాహనదారులు తెలియజేస్తున్న సిగ్నల్ గుర్తులను అనుసరించి బస్సులను నడపాలని అన్నారు. బస్సులు నిలిపేక్రమంలో ఎడమవైపుకు మాత్రమే బస్సులను నిలిపి ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు పాటించాలన్నారు. తద్వారా జరగబోయే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. 2023 లో ప్రమాదాలు శాతం పూర్తిగా తగ్గిందన్నారు. ప్రమాదాలు సంభవించకుండా డ్రైవర్లు జాగ్రత్త వహించాలని అన్నారు. బ్రేక్ డౌన్ కాకుండా ఎప్పటికప్పుడు బస్సులను పరిశీలించాలని గ్యారేజీ మెకానిక్ సిబ్బందిని కోరారు. డిపో మేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రమాదాలు అరికట్టేందుకు డ్రైవర్లతో పాటు కాండక్టర్లూ అప్రమత్తంగా మెలిగి డ్రైవర్లకు సహకరించాలన్నారు. ప్రతిరోజు అరగంట ముందే డ్రైవర్లు విధులకు హాజరవ్వాలని సూచించారు. ఎటువంటి ఆగ్రహ ఆవేశాలకు లోనవ్వకుండా ప్రయాణికులను సురక్షితంగా గమ్యాన్ని చేర్చాలని కోరారు. జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకూ ఈ భద్రతా వారోత్సవాలు జరగనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

కొండపల్లి ఖిల్లాను సందర్శించిన వర్సిటీ విద్యార్థులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ విభాగం కొండపల్లి ఖిల్లాను సందర్శించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ పి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ వారసత్వ ప్రదేశంగా, ఆకర్షణీయమైన యాత్రగా ఇది నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కట్టడాలు కలకాలం ఆకర్షణీయంగా ఉండటానికి బలమైన గోడలు, కోట యొక్క క్లిష్టమైన డిజైన్‌లను విద్యార్థులు, అధ్యాపకులు పరిశీలించారు. తెల్ల పుణికి చెక్కతో కొండపల్లి బొమ్మలను తయారు చేసే సాంప్రదాయక కళను సజీవంగా ఉంచుతున్న స్థానిక కళాకారులతో సంభాషించారు. పి.ఎం.మోదీ సూచన మేరకు 'లోకల్ ఫర్ లోకల్' తర్వాత ప్రపంచ ప్రసిద్ధి చెందిన స్థానిక కళాత్మకతను ప్రోత్సహించడానికి కొన్ని బొమ్మలను కొనుగోలు చేశారు. ఇందులో భాగంగా ఐక్యత, సమానత్వం, సామాజిక న్యాయానికి శక్తివంతమైన ప్రతీకగా నిలిచిన భారతరత్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహాన్ని సందర్శించారనీ పేర్కొన్నారు.



గ్రేడింగ్ చేస్తున్నా మహిళ హమాలీలు

రూ.వెయ్యి పెరిగిన పసుపు ధర

ప్రజాశక్తి దుగ్గిరాల : స్థానిక వ్యవసాయ మార్కెటింగ్ యాడ్లో గురువారం పసుపు ధరలు రికార్డ్ స్థాయిలో ఒక్కరోజులో క్వింటాకు వెయ్యి రూపాయలు పెరిగాయి. బుధవారం 10200 గరిష్ట ధర కాగా గురువారం 11,125 రూపాయలు పలికినది. ధరలు పెరిగటానికి వ్యాపారస్తులు రకరకాల కారణాలు తెలుపుతున్నారు. గత శుక్రవారం అగ్ని ప్రమాదానికి లోనైనా స్థానిక కోల్డ్ స్టోరేజ్‌లో దాదాపు 1,20,000 బస్తాలు కాలిపోయాయి దీనితో ఒక్కసారిగా ధరలు పెరిగాయని ఒక వ్యాపారస్తుడు తన అభిప్రాయాన్ని తెలియజేశాడు. కానీ పై మార్కెట్లలో డిమాండ్ పెరగడమే ధరలు పెరగడనికి కారణమని తెలిసినది ,నిజామాబాద్ మార్కెటింగ్ యార్డులో గత మూడు రోజుల్లో రూ.1800 పెరిగాయి దాని ప్రభావమే ధరలు పెరగడానికి కారణమని మరో వ్యాపారస్తుడు అభిప్రాయం వ్యక్తం చేశాడు. ప్రతి సంవత్సరం జనవరి 15 నుండి నిజామాబాద్ మార్కెట్కు క్రొత్త పంట వస్తుంది ఈ సంవత్సరం ఇంకా రాలేదు దీనితో ఈ సంవత్సరం పంట సాగు తక్కువగా ఉన్నదనే కారణంగా వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారని మరో వ్యాపారస్తుడు తన అభిప్రాయాన్ని తెలిపారు. గత ఐదు ఆరు సంవత్సరాల నుండి ధరలు ఆశాజనకంగా లేకపోవడం వలన ఈ సంవత్సరం సాగు బాగా తగ్గిందని దీనితో పంట దిగుమతి తగ్గి ధరలు పెరిగే అవకాశం ఉన్నదని వ్యాపారస్తులు తెలిపారు. ఎగుమతి ఆర్డర్లు ఎక్కువగా ఉండటం పై మార్కెట్లలో డిమాండ్ పెరగటం తో ధరలు ఒక్కసారిగా పెరిగాయని భావిస్తున్నారు .ఈ సంవత్సరం రూ.15000లకు పెరగ వచ్చని వ్యాపారస్తులు ఆశిస్తున్నారు.



టిఫిన్ బండి అందజేస్తున్న నాయకులు

టిఫిన్ బండి అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని 15వ వార్డు రామాలయం దగ్గర టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో సంకుల కళ్యాణ్‌కు టిఫిన్ బండిని గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్, ఢిల్లీ రామారావు, బ్రమ్ముక్కు శ్రీనివాసరెడ్డి, తాడిబోయిన భాస్కర్ పాల్గొన్నారు.

అమరావతి విచ్ఛిన్నంతో ఉపాధికి తీరని నష్టం

గుంటూరులో తెలుగుయువత ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

నాలుగున్నరేళ్లుగా అమరావతిలో అసువులు బాసిన రైతుల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే అమరావతి విచ్ఛిన్నంతో 17 లక్షల ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ముఖ్యమంత్రి గండి కొట్టారని గుంటూరు జిల్లా తెలుగుయువత అధ్యక్షులు రావిపాటి సాయి కృష్ణ ఆరోపించారు. అమరావతి రాజధాని పరిరక్షణ మహోద్యమం 1500వ రోజు పూర్తి చేసుకున్న సందర్భముగా అమరావతి పరిరక్షణ యువజన జెఏసి కన్వీనర్ రావిపాటి సాయి కృష్ణ ఆధ్వర్యంలో రైతులకు సంఘీభావంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత బృందావన్ గార్డెన్స్ నుండి ప్రారంభమైన ర్యాలీ లక్ష్మీపురం లాడ్జి సెంటర్ శంకరవిలాస్ మీదగా హిందు కళాశాల సెంటర్లో గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్దకు చేరుకొని అమరజీవి విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం కలెక్టరేట్ ఎదుట ఉన్న తెలుగు తల్లి విగ్రహం వద్ద ముగించి తెలుగుతల్లి విగ్రహానికి నివాళులర్పించి అమరావతి రాజధాని ఉద్యమంలో మానసిక వేదనతో అసువులు బాసిన రైతులకు శ్రద్ధాంజలిగా మౌనం పాటించారు. ఈ సందర్భంగా యువజన జెఏసి సభ్యులు జనసేన నాయకులు ఆళ్ల హరి మాట్లాడుతూ ప్రాణసమాన మైన భూమిని రాష్ట్ర భవిష్యత్ కోసం ఇస్తే రాజకీయ కక్షల కోసం నాశనం చేశారని అన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి నేత షేక్ జిలాని, రాష్ట్ర తెలుగుయువత ఉపాధ్యక్షులు షేక్ ఫిరోజ్, రైతు నాయకులు భాష్యం నరసయ్య , రావిళ్ల వెంకటయ్య, శ్రీనివాసరావు, వి.సుబ్బారావు, షేక్ జిలాని పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న తెలుగుయువత కార్యకర్తలు

జిజిహెచ్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి



ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలనీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. గురువారం శుశృత హాలులో వివిధ విభాగాధిపతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆసుపత్రి కి ప్రతి రోజు వందలాది మంది రోగులు వస్తున్నారని వారికి సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నూతనంగా ఇంటెన్సివ్ కేర్ యూనిట్ కూడా ప్రారంభించామని, అత్యవసర విభాగం లో విధుల్లో ఉన్న వైద్యులు, పీజీ, హౌస్ సర్జన్లు, నర్సింగ్ సిబ్బంది, గ్రేడ్ 1, గ్రేడ్ 2, హెడ్ సిస్టర్స్, స్టాఫ్ నర్సులు, నర్సింగ్ స్టూడెంట్స్ లకు ప్రత్యేక గదులను కేటాయించడం తో పాటు అన్నీ రకాల వసతులను కల్పించామని చెప్పారు. విధుల్లో ఉన్న సిబ్బంది తప్పనిసరిగా అత్యవసర విభాగం లో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కాన్పుల వార్డు లో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణుల తో కమిటీని ఏర్పాటు చేసి మహిళా రోగులకు ఆపరేషన్ సమయం లో రక్త స్రావాన్ని అరికట్టెందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయం లో ఆసుపత్రి లో జరిగే పరిణామలను రాజకీయ రంగు పులిమే అవకాశలు ఉన్నాయని, వైద్య సిబ్బంది అప్రమత్తం గా ఉండాలని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి గుండె పోటు తో ప్రభుత్వ ఆసుపత్రి కి వచ్చే రోగులను కొత్తగా నిర్మించిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్ లో నాలుగు పడకలను కేటాయించామని ఆయన చెప్పారు. ఆరోగ్యశ్రీ కేసులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఒ డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.



జీవో 12ను అమలు చేయాలి

కమిషనర్‌కు ప్రొసీడింగ్స్ కాపీని అందజేసిన కార్మికులు

ప్రజాశక్తిసత్తెనపల్లి

జీవో నెంబర్ 12 ప్రకారంమున్సిపల్ కార్మికులకు రూ.వెయ్యి కానుక అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) సత్తెనపల్లి అధ్యక్షులు చింతకుంట్ల పెద్దవెంకయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ కె.షమీని కలిసి ప్రొసీడింగ్స్ కాపీని అందజేశారు. మున్సిపల్ కార్మికులు ఇటీవల చేసిన సమ్మె పోరాటం సందర్భంగా ప్రభుత్వం జీవో 12 ప్రకారం రూ.వెయ్యి కానుకగా ప్రకటించిందనానరు. ఈ జీవో అమలుకు అవసరమైన ప్రొసీడింగ్స్ సి అండ్ డిఎంఎ రాష్ట్రంలోని అన్ని మున్సిపల్ కమిషనర్లకు పంపించారని చెప్పారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించి హామీనిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ పల్నాడు జిల్లా అధ్యక్షులు చంద్రకళ, కార్మికులు ఎం.సత్యవతి, ఎ.డేవిడ్, జి.దుర్గా, సిహెచ్. చిన్నవెంకయ్య పాల్గొన్నారు.

తెల్లవారుజాము నుండే కుల గణన

ప్రజాశక్తి - క్రోసూరు



క్రోసూరులో తెల్లవారుజాము నుండి ఎఎన్ఎం లావణ్య, వాలంటీర్లు నూర్జహాన్, రహీం, మహేష్ కుల గణన చేపట్టారు. రైతులు పొలానికి వెళ్లి పగలు అందుబాటులో ఉండటం లేదని, అందుకే ఉదయాన్నే కుటుంబాల వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తున్నామని వారు తెలిపారు. చాలా వివరాలు ఉండటంతో ఒక్కో కుటుంబ వద్ద ఎక్కువ సమయం పడుతోందని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తవుతుందో లేదోనని సందేహం వెలిబుచ్చారు.

ఓపెన్ స్కూల్లో రెండో దశ ప్రవేశానికి ఈ నెల 30 లోగా ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు ఎఐ కేంద్రాల్లో ఈనెల 30 లోగా అడ్మిషన్ ఫీజు చెల్లించాలని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శ్యాముల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పెల్-1లో రిజిస్టర్ అయ్యి అడ్మిషన్ ఫీజు చెల్లించని వారు పాత రిజిస్ట్రేషన్ సెంటర్‌లో అడ్మిషన్ ఫీజు చెల్లించి కొనసాగవచ్చని పేర్కొన్నారు. అడ్మిషన్ ఫీజు చెల్లించిన అభ్యాసకులు స్పెల్-1 అభ్యాసకులతో పాటు ఫిబ్రవరి 4 నుంచి మార్చి 17 వరకు జరిగే పిసిసి తరగతులకు హాజరు కావాలని తెలిపారు. వేసవి సెలవుల్లో మే 1 నుంచి జూన్ 9వ తేదీ వరకు పీసీసీ తరగతులకు హాజరైన వారినే జూన్/జులైలో జరిగే పరీక్షకు అనుమతిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సంబంధిత ఎఐ కేంద్రాల్లోని కో-ఆర్డినేటర్లను సంప్రదించాలని సూచించారు.

వాసవీ క్లబ్ ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - మాచర్ల : పట్టణంలో ఈ నెల 27వ తేది శనివారం ఉదయం స్థానిక ఎన్‌జిఓ పెన్షనర్స్ హాల్ నందు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఓరుగంటి చెన్నకేశవరావు, పందిరి నరసింహారావులు తెలిపారు. ఆపరేషన్లు అవసరం అయిన వారికి నంద్యాలలోని మెడికల్ కాలేజిలో ఉచితంగా అడ్వాన్స్‌డ్ ఫ్యాకోలేజర్ ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. వివరాల కోసం 9849065882, 9949725359 నంబర్లలో సంప్రదించాలన్నారు.





మాచర్ల, అమరావతిలో ధర్నా చేస్తున్న పెన్షనర్లు

ప్రశాంతంగా జీవించాల్సిన వారిని అవస్థల పాల్జేయొద్దు

పెన్షనర్ల ఆవేదన - బకాయిల విడుదల, ఇతర సమస్యల పరిష్కారం కోసం ధర్నా - తహశీల్దార్లకు వినతులు

ప్రజాశక్తి - మాచర్ల

పెన్షనర్స్‌కు వివిధ రూపాల్లో చెల్లించాల్సిన బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించి ఆదుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందా నరసింహయ్య, నాగేశ్వరరావులు కోరారు. రాష్ట్ర సంఘ పిలుపు మేరకు గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నందా నరసింహయ్య, నాగేశ్వరరావు మాట్లాడుతూ 2018 నుండి, తదుపరి పెంచిన డిఆర్ ఏరియర్స్, 11వ పిఆర్‌సి తాలుకు ఏరియర్స్ ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇహెచ్ఎస్ కార్డు ద్వారా సరైన వైద్యం అందటం లేదన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్రింద ఇస్తున్న రూ.2 లక్షలను రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. ఉద్యోగ విరమణ చేసిన వృద్ధులమైన తాము ప్రశాంతంగా జీవించడానికి సహకరించాలేగాని అవస్థలపాల్జేయొద్దని కోరారు. అనంతరం తహశీల్ధార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అసోసియేషన్ కోశాధికారి షేక్ గాలిబ్‌సాహెబ్, జె.మర్రెడ్డి, ఎం.పాపిరెడ్డి, సి.రామనాథశర్మ, నాగేశ్వరరావు, జయరావు, లక్ష్మణరావు, వైవి కోటయ్య, జి.హరినాధ్, శీతారామయ్య, చక్రపాణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

ప్రజాశక్తిసత్తెనపల్లి

స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పెన్షనర్స్ ధర్నా చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బొడ్డు రామారావు మాట్లాడుతూ అడిషనల్ క్వాంటమ్ పూర్వం మాదిరిగా ఇవ్వాలని అన్నారు. యూనియన్ కార్యదర్శి ప్రొఫెసర్ల పురుషోత్తం, నాయకులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 11వ పిఆర్సి ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు ఎన్జీవో సంఘం నాయకులు మణిరావు మద్దతు తెలిపారు. అసోసియేషన్ నాయకులు పోతులూరయ్య, కేవీఆర్జే ప్రసాద్, రంగారెడ్డి, వెంకటాద్రి, మురహరిరావు, కృష్ణ, రామకోటయ్య, నాగవర్ధన్,ఎంవిజె నాయకులు అంబేద్కర్, జయనుల్లా, రమాదేవి, హెలినా, మల్లేశ్వరరావు, నరసింహారావు, హృదయమేరి, రవి, వెంకట్రావు, హనుమంతురావు, సూర్యనారాయణ, సుబ్బారావు, ఖాదర్ వలీ, శృంగారం పాల్గొన్నారు.

ప్రజాశక్తి అమరావతి

తహశీల్దార్ కార్యాలయం వద్ద పెన్షనర్లు ధర్నా చేసి తహశీల్దార్ విజయశ్రీకి వినతి పత్రం ఇచ్చారు. నాయకులు జి.కోటేశ్వరరావు, తిమ్మయ్య, జిల్లా ఎన్జీవో నాయకులు ఆర్.నాగేశ్వరరావు, ఎస్.రాజశేఖర్, వై.సుబ్బారావు, ఎన్.నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియ వరకూ ఓటు నమోదుకు అవకాశం



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాజ్యాంగం, ఎన్నికల సంఘం ఇచ్చిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అన్నారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని గడియారపు స్థంబం నుండి పట్టణం ప్రకాష్ నగర్‌లోని భువనచంద్ర టౌన్‌హాలు వరకు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం టౌన్‌హాల్‌లో 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 1950-జనవరి 26 గణతంత్ర దినోత్సవానికి ఒక రోజు ముందు ఎన్నికల సంఘం ఏర్పడిందని, అప్పటి నుండి దేశములో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం పనిచేస్తోందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పల్నాడు జిల్లాలో 2.4 శాతం మంది యువత మాత్రమే ఓటుహక్కును కలిగివున్నారని, దానిని 4 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రత్యేక సారాంశ సవరణ ద్వారా 1.11 లక్షల మందికి ఓటు హక్కు కల్పించామన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నపుడు తప్పనిసరిగా సి-విజిల యాప్ ద్వారా సమాచారాన్ని భాద్యాతాయుతంగా అందచేయాలని సూచించారు. నామినేషన్ ప్రక్రియ మొదలు వరకు ఓటు హక్కు పొందవచ్చని, సవరణలు ఉంటాయని వివరించారు. జిల్లాలో 86 శాతంగా ఉన్న పోలింగ్‌ను 87 శాతానికి పెంచాలన్నారు. జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఓటు విలువైనద, తప్పనిసరిగా యువత ఓటు హక్కు కలిగి ఉండాలని అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, షేక్ సైదా, సుబ్బారావు, నాగేశ్వరమ్మ, సీనియర్ పాత్రికేయులు అప్పారావు, రమేష్, రమణరెడ్డిని సత్కరించారు. పాఠశాల, కళాశాల స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రసంశా పత్రం, జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో అమృత రాణి, షబ్నం ఆరా, అంజనీ మహాలక్ష్మి, ప్రశాంత్, చైతన్య ప్రసంగం ఆలరించింది. ట్రైనీ కలక్టర్ కల్పశ్రీ, డిఆర్ఒ వినాయకం, ఆర్‌డిఒ శేషిరెడ్డి, తహశీల్దార్ ఆర్‌వి రమణనాయక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

పల్నాడు జిల్లా వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం ఆధ్వర్యంలో ప్రచురించిన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం పోస్టర్లను ఓటరు నమోదు అధికారి జి.వసంతబాబు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు. పల్నాడు జిల్లా వినియోగదారుల సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవి నాయక్, సహాయ కార్యదర్శి బాబి విక్రమ్, మున్సిపల్ కమిషనర్ గోవిందరావు, టౌన్ ప్లానింగ్ అధికారి కె.సునీత, యడ్లపాడు, నాదెండ్ల తహశీల్దార్లు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రమైన ముప్పాళ్లలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ఓటర్లతో తహశీల్దార్ భవానీ శంకర్ ప్రతిజ్ఞ చేయించి మాట్లాడారు. ఓటు హక్కును సరిగా వినియోగించుకుని ప్రజాస్వామ్య విలువలను పెంచాలన్నారు. అనంతరం స్థానిక జెడ్‌పి పాఠశాల వద్ద నుండి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ అయిన పొన్నం కోటయ్యను సన్మానించారు. ఎంపిడిఒ పుట్టారెడ్డి, ఎంఇవో-2 సీతారామిరెడ్డి, ఏవో అరుణ, డిటి లక్ష్మీ ప్రసాద్, పాఠశాల హెచ్ఎం నాగేంద్రమ్మ, ఎన్‌సిసి ఆఫీసర్ కె.సాయిజగన్నాథరావు, ఎఎస్ఐ నవరాజ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

మండల కేంద్రమైన యడ్లపాడులోని లూథరన్ ఉన్నత పాఠశాల ఆవరణలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. తహశీల్దార్ వైవిబి కుటుంబరావు మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం సీనియర్ ఓటర్లను సత్కరించారు.

ప్రజాశక్తి - మాచర్ల

ఓటర్ల జాబితా పట్ల ప్రతి నిత్యం అప్రమత్తతతో ఉంటూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించటంలో బిఎల్ఓలు కీలకంగా పని చేయాలని డివిజనల్ లెవల్ అభివృద్ధి అధికారి గబ్రూనాయక్, మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు సూచించారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకోని బిఎల్ఓలు, మున్సిపల్ సిబ్బందితో మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు.



గుంటూరులో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు



తెనాలి ధర్నాలో పెన్షనర్స్, ఎన్జీవో అసోసియేషన్ నాయకులు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

పెన్షనర్ల పెండింగ్ సమస్యలపై గురువారం స్థానిక గుంటూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు కె.నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 11వ పిఆర్‌సిలో తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను తిరిగి యధావిధిగా అంతకు ముందు ఇస్తున్నట్లు 70 సంవత్సరాలు నిండిన వారికి 10శాతం, 75 సంవత్సరాలు నిండిన వారికి 15 శాతంకు పునరుద్ధరించాలని కోరారు. డి.ఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, గత పిఆర్‌సి అరియర్లు వెంటనే చెల్లించాలని, హెల్త్‌కార్డు ద్వారా అన్ని వ్యాధులకూ అన్ని గుర్తింపు పొందిన హాస్పిటల్స్‌లో వైద్యం అందించాలని, మెడికల్ రియంబర్స్‌మెంట్ పరిధి 2 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. జెఎసి జిల్లా చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పెన్షనర్ల డిమాండ్లు న్యాయమైనవని, ప్రభుత్వం స్పందించి, వాటిని పరిష్కరించాలని కోరారు. జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి మాట్లాడుతూ విజయవాడలో ఫిబ్రవరి 5న జరిగే ధర్నాలో పెన్షనర్లు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.ధర్నాలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రభుదాసు, కోశాధికారి టి.వి.ఎస్.ఎస్.ఆర్.ఎ.శర్మ, ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.నాగూర్ షరీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సతీష్‌కుమార్, యుటిఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు కె.జోజయ్య, వివిధ సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. ధర్నా అనంతరం తహశీల్దారుకు వినతి పత్రం అందచేశారు.

ప్రజాశక్తి తెనాలి

ప్రభుత్వ పెన్షనర్స్‌కు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ ఎపి పెన్షనర్స్ అసోసియేషన్ తెనాలి శాఖ ఆధ్వర్యంలో స్థానిక ధర్నా చౌక్ లో గురువారం ధర్నా చేశారు. పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు నిర్వహించిన ధర్నాలో అసోసియేషన్ అధ్యక్షులు మాచిరాజు రామకృష్ణమూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ దారులకు డిఆర్, పిఆర్సీ బకాయిలను తక్షణమే చెల్లించాలని, ఈ హెచ్ ఎస్ ద్వారా పూర్తిగా నగదు రహిత వైద్య సేవలు అందించాలని, పెన్షనర్స్ కు అమలులో ఉన్న మెడికల్ రీయంబర్స్మెంట్ రూ 2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే గతంలో 70 సంవత్సరాలు దాటిన పెన్షనర్లకు 10 శాతం, 75 సంవత్సరాలు నిండిన వారికి 15శాతం క్వాంటం పెన్షన్ ఉండేదని, దానిని 70 సంవత్సరాలు నిండిన వారికి ఏడు శాతంగా, 75 సంవత్సరాల నిండిన వారికి 12 శాతంగా ప్రభుత్వం తగ్గించిందని, పాత క్వాంటం పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని కోరారు. సమస్యలపై ప్రభుత్వం స్పందించని నేపథ్యంలో ఈ నెల 29న కలెక్టరేట్ వద్ద, వచ్చేనెల ఐదున విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు హెచ్చరించారు. అసోసియేషన్ కార్యదర్శి సూర్యప్రకాశరావు పర్యవేక్షణలో జరిగిన ధర్నాకు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తెనాలి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, కష్ణమోహన్, సిఐటియు నాయకులు కె బాబు ప్రసాద్, ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్ వలి, లెక్చరర్స్ అసోసియేషన్ నాయకులు డివిఎల్ సోమయ్య శాస్త్రి, నారాయణరావు, వాకర్స్ క్లబ్ నుంచి వెంకటరత్నం, లాయర్స్ అసోసియేషన్ నుంచి గౌరీ శంకర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న దిలీప్ రాజా

28న తెనాలికి రానున్న అన్షుల్ అవిజిత్

ప్రజాశక్తి తెనాలి

భారత మాజీ ఉపప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ మనుమడు, లోక్ సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ తనయుడు, ఏఐసిసి అధికార ప్రతినిధి అన్షుల్ అవిజిత్ జనవరి 28న తెనాలి రానున్నట్లు దర్శకులు దిలీప్ రాజా వెల్లడించారు. స్థానిక సుల్తానాబాద్ లోని రత్నా ఫార్చ్యూన్ కళ్యాణ మండపంలో గురువారం ఆయన మాట్లాడుతూ బాబూజీ పేరిట తెనాలిలో జగజ్జీవన్ రామ్ బయోపిక్ షూటింగ్ జరుగుతున్న నేపథ్యంలో అన్షుల్ అవిజిత్ వస్తున్నట్లు చెప్పారు. జగజ్జీవన్ రామ్ అభిమానులు పెద్ద ఎత్తున ఆదివారం ఉదయం 9 గంటలకు తెనాలి తరలి రావలసిందిగా ఆయన పిలుపునిచ్చారు. సాంఘిక సంక్షేమ సలహా మండలి మాజీ సభ్యులు ఆరుగొలను జాస్మిన్ మాట్లాడుతూ దక్షణ భారత దేశంలో జగజ్జీవన్ రామ్ కు విశేషంగా అభిమానులున్నారని, బాబూజీ సినిమా ద్వారా ఆయన జీవిత విశేషాలు తెరకెక్కించడం మంచి పరిణామమన్నారు. సమావేశంలో బాబూ జగజ్జీవన్ రామ్ కమిటీ అధ్యక్షులు మేకల సురేష్, ప్రముఖ న్యాయవాది ఇందుపల్లి రాజారాం, ఎంఆర్పిఎస్ నాయకులు జయప్రకాష్, అత్తోట శరత్ బాబు, కొందముది బోస్, శ్రీహర్ష, కమలాకర్, పినపాటి జనార్ధన్, టిన్ను, శరత్ బాబు పాల్గొన్నారు

హిందూ ఫార్మసీ కాలేజీలో ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న లియో కన్సల్టెంట్ అధినేత డేవిడ్

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసి కళాశాలలో గురువారం డి.ఫార్మసీ/ బి.ఫార్మశీ/ ఎం. ఫార్మసీ, ఫార్మా.డి కోర్సులలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగత వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలపై నమ్మకం ఉంచి, చేరిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తమ ధన్యవాదాలు తెలియచేశారు. కళాశాలలో ఉన్న మౌలిక వసతుల్ని వినియోగించుకొని ఉత్తమ ఫార్మసిస్ట్‌లు అభివృద్ధి చెందాలని, కుటుంబానికి, కళాశాలకు పేరు తేవాలని కోరారు. ముఖ్య అతిథిగా హాజరైన ఐర్లాండ్‌లోని లియో కన్సల్టెంట్ అధినేత డేవిడ్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులు డిగ్రీ తరవాత యూనివర్సిటీలలో పి.జి విద్యను అభ్యసించి ఔషధ రంగంలో పరిశోధనలు చేయాలన్నారు.అనంతరం కళాశాల యాజమాన్యం డేవిడ్ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. సభలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ కె.రవికుమార్, ఫార్మా.డి. డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, తదితర అధ్యాపకులు, విదార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

29న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి-తాడేపల్లి

రజకుల అభివృద్ధికి తోడ్పాటు పడాలని, రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని తదితర సమస్యల పరిష్కారానికి ఈ నెల 29న తాడేపల్లి మేకా అమరారెడ్డి భవన్‌లోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరుగుతున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లభాపురం వెంకటేశ్వరరావు కోరారు. ఈ మేరకు గురువారం తాడేపల్లిలోని అపార్టుమెంట్ల వద్ద కరపత్రాలు పంపిణీ చేసి సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతత వారం రోజుల నుండి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో వివిధ అపార్ట్మెంట్లు వద్ద, సుందరయ్య నగర్, కుంచనపల్లి, ఇప్పటం, కృష్ణనగర్, ఉండవల్లి, పెనుమాక, తుళ్లూరు, రాయపూడి తదితర రజకుల నివాస ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించామన్నారు. గడిచిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో వైసిపి అధికారంలో ఉన్నప్పటికీ రజకుల అభివద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రజక అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ద్వారా చేపట్టాల్సిన విధివిధానాలను రూపొందించకపోవడం, బడ్జెట్ నిధులను రజక కార్పొరేషన్కు



కేటాయించకపోవడం వంటి చర్యలు రజకుల పట్ల వారి చిత్తశుద్ధికి తార్కాణంగా మారిందన్నారు. ఈ క్రమంలో సోమవారం తాడేపల్లిలో జరిగే రాష్ట్ర సదస్సులో రజకులను చైతన్యపరుస్తూ ఆందోళన కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బొజ్జ సుబ్బారావు, పాగోలు శ్రీనివాసరావు, కె శ్రీను, నరసింహారావు, ధరణికోట ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ముందు మురుగు సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్



చిట్టి, పొట్టి చిన్నారులు విద్యనభ్యసించే విద్యాలయం ముందే రోజు మురుగు పారుతున్న పట్టించుకునే నాధుడే కరువైపోయాడు. పిల్లల ఆరోగ్యాలతో మాకు సంబంధం లేదన్నట్లు మున్సిపల్ అధికారులు మిన్నకుండిపోయారు. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి ఎంపీయు పీ స్కూల్ గేటు ముందు ఓ టిఫిన్ హోటల్, చుట్టుపక్క పరిసరాలలో వాడిన వ్యర్థపు నీరు రోడ్డుపైనే నిత్యం పారుతూ, దుర్గంధం వెదజల్లుతున్న ఏ ఒక్క సచివాలయ ఉద్యోగి కానీ, గ్రామ సచివాలయ కార్యదర్శి కాని పట్టించుకున్న పాపాన పోలేదు. స్కూలు ముందు డ్రైనేజీ కాలువ లేకపోవడం తో మురుగు నీరు అంతా వచ్చి గేటు ముందే నిలిచిపోవడంతో, దుర్గంధం వెదజల్లుతూ దోమలు ప్రబలుతున్నాయి. దీనివలన అంటూ వ్యాధులు వచ్చి, విద్యార్థులు అనారోగ్యానికి గురి అయ్యే ప్రమాదం ఉంది. వి విద్యార్థులు జబ్బులు బారిన పడకముందే , సంబంధిత గ్రామ సచివాలయ, మున్సిపల్ అధికారులు చొరవ చూపి, ప్రాథమిక పాఠశాల గేటు వద్ద మురుగునీరు నిలవకుండా తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు పలువురు కోరుతున్నారు.

జిల్లా ఇహెచ్ఎస్ కమిటీ సమావేశం నిర్వహించాలి

ప్రజాశక్తి-గుంటూరు



డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్న ఎపిజిఇఎ నాయకులు

ఎంప్లాయీస్ హెల్త్ స్కీంపై జిల్లా స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు చాంద్ భాషా కోరారు. ఈ మేరకు గురువారం జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖర్‌రావును కలిసి వినతిపత్రం అందచేశారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు, ఉద్యోగులకు ఇస్తున్న ఇహెచ్ఎస్ రాయితీలు, నెట్‌వర్క్ హాస్పిటల్‌లో ఉద్యోగులకు నగదురహిత వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకునేలా జిల్లాస్థాయి ఈహెచ్ఎస్ కమిటీలో చర్చించాలని కోరారు. డిఆర్ఒకు వినతిపత్రం ఇచ్చిన వారిలో చాంద్‌బాషాతోపాటు, జిల్లా కార్యదర్శి కెవిఎస్.శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరిముల్లా షాఖాదరి, నగర అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగర సంయుక్త కార్యదర్శి జాన్ పాల్గొన్నారు.



మహ్మద్ షరీఫ్‌ను సన్మానిస్తున్న రాజధాని రైతులు

షరీఫ్‌కు రాజధాని రైతుల సన్మానం

ప్రజాశక్తి - తుళ్లూరు : మూడు రాజధానుల బిల్లు శాసన మండలిలో చర్చకు వచ్చినప్పుడు చైర్మన్‌గా ఉన్న మహమ్మద్ అహ్మద్ షరీఫ్‌ను రాజధాని రైతులు, మహిళలు, టిడిపి, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు సన్మానించారు. అమరావతి మహోద్యమం గురువారంతో 1500 రోజులు కావడంతో మందడం రైతు దీక్షా శిబిరంలో షరీఫ్ కు సన్మానం చేశారు. న్యాయ దేవత విగ్రహానికి పాలాభిషేకం చేశారు. అనంతరం మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, నన్నపనేని రాజకుమారి, పి అశోక్ బాబు, మాజీ ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ , కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గద్దె అనూరాధ,రాయపాటి శైలజ,పులి చిన్నా,మేళం భాగ్యారావు,కమ్మెల శ్రీధర్,బెల్లంకొండ నరసింహారావు తదితరులు రైతు ఉద్యమంపై ప్రభుత్వం అణచివేత తదితర అంశాలపై మాట్లాడారు. అమరావతి ఉద్యమం 1500 వందలకు చేరడంతో రాజధాని గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపట్టారు. పులి చిన్న బైక్ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో అమరావతి జెఎసి నాయకులు స్వరాజ్యరావు,ముస్లిం మైనారిటీ నాయకులు సిబ్లి ,సిపిఐ నాయకులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జంగాల అజయ్ కుమార్ ,అక్కినేని వనజ,టిడిపి నాయకులు వర్ల రామయ్య, జి కోటేశ్వరరావు, వెలగ పూడి గోపాల కష్ణ,జనసేన నాయకులు గాదె వెంకటేశ్వరరావు, సిపిఎం నాయకులు ఎం రవి,కాంగ్రెస్ నాయకులు చిలక విజయ్,దళిత జెఎసి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ శామ్యూల్ రాజీవ్ కుమార్

గొడవలు పెట్టుకుని నష్టపోవద్దు

ప్రజాశక్తి - యడ్లపాడు

గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులకు ప్రజలు సహకరించాలని ఎస్ఐ జె.శామ్యూల్ రాజీవ్‌కుమార్ కోరారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మైదవోలును ఆయన బుధవారం రాత్రి సందర్శించారు. గ్రామంలోని కమ్యూనిటీ హాలు వద్ద సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల రానున్న నేపథ్యంలో పల్లెల్లో ప్రశాంత వాతావారణం నెలకొల్పడమే పల్లెనిద్ర ముఖ్యోద్దేశం అన్నారు. ప్రజలు స్నేహపూర్వకంగా ఉండాలని, ఏదైనా సమస్య వచ్చినపుడు ఇరు పక్షాల పెద్దలు మాట్లాడుకుని స్వయం పరిష్కారమార్గాన్ని చూపాలని సూచించారు. సమస్య జఠిలమైతే పోలీసుల దృష్టికి తేవాలన్నారు. ఘర్షణలు పడి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, కుటుంబ పరంగా నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరి లక్ష్మయ్య, స్థానిక ప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాగులు అందిస్తున్న క్లబ్ సభ్యులు

విద్యార్థులకు ఇన్నర్ వీల్ క్లబ్ బ్యాగులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

జాతీయ బాలికా దినోత్సవం, ఇన్నర్ వీల్ క్లబ్‌ను స్థాపించి వందేళ్లయిన సందర్భంగా పసుమర్రులోని శ్రీ మద్ది కామయ్య జెడ్‌పి పాఠశాలలో 100 మందికి స్కూల్ బ్యాగులను ఇన్నర్ వీల్ డిస్ట్రిక్ట్ 315 క్లబ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం వై.హనుమంతరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ డిస్ట్రిక్ట్ అధ్యక్షులు ఎం.ఇందిరా మాట్లాడుతూ విద్యార్థులంతా ఉన్నత స్థాయికి ఎదగాలని, ఇతరులకు సహాయ పడాలని కోరారు. కార్యక్రమంలో డి.విజయశ్రీ, టి.శివకుమార్, శంకర్‌రావు, ఎస్.అప్పారావు, షేక్ మొహమ్మద్ యాసీన్, నాగరాజు, రాజ్యలక్ష్మి, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ఫౌండేషన్ అందించిన మెటీరియల్‌తో విద్యార్థులు

పట్టుదలతో చదివితో ఉన్నత స్థాయికి

ప్రజాశక్తి - పెదకూరపాడు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని క్రమశిక్షణ పట్టుదలతో చదివితే ఉన్నత స్థితికి చేరుకోవచ్చని పెదకూరపాడు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం కెవి రమణ అన్నారు. గురువారం పాటిబండ్ల ఆర్‌సిఎం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రాయపూడి సెల్ఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెంకటేశ్వరరావు, రంగారాయుడు, రఘు నాయుడు ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్, మోడల్ పేపర్స్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఆర్.సాంబశివరావు, పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయులు కె.నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయాల వద్ద ఉపాధ్యాయుల నిరసన



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా, చిలకలూరిపేట

రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షులు ఎం.మోహనరావు, జిల్లా కార్యదర్శి కె.తిరుపతిస్వామి డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై నరసరావుపేట, చిలకలూరిపేట మున్సిపల్ కార్యాలయాల వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులను పాఠశాల విద్యా పర్యవేక్షణలోకి తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 84 జిఓ జారీ చేయడంతో మున్సిపల్ ఉపాధ్యాయులు సమస్యలు పరిష్కారం అవుతాయని భావించామని, డిడిఓ పవర్‌తో పాటు కొన్ని సమస్యలు పరిష్కారమైనా ప్రధాన సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బదిలీలు, ప్రమోషన్లు తక్షణమే నిర్వహించాలని, మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. మున్సిపల్ టీచర్లకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని పాఠశాలలకు బోధన సిబ్బంది నియమించాలని, బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్ ఖాతాలు తెరవాలని, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్స్ ఈ ఏడాది రిటైర్మెంట్ నోటీసులు వెంటనే ఇవ్వాలన్నారు. ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై విజయవాడలో ధర్నాకు బుధవారం ఉదయం అనుమతిచ్చి సాయంత్రానికి రద్దు చేయడం ఏమిటని ప్రశ్నించారు. నరసరావుపేట నిరసనలో నాయకులు కె.ఉషా, సౌరీరాణి, ఒ.కోటేశ్వరరావు, కె.వెంకటేశ్వరరావు, కెవి నాగయ్య, సాంబయ్య, ఖాసీం, రాము, హరిత, కోమలి, రవి, మూర్తి, శ్రీనివాసరావు, సత్యానంద్, చిలకలూరిపేటలో కె.అరుణ, ఎ.చెన్నకేశవరావు, టి.సుధాకర హరిప్రసాద్, బి.నాగేశ్వరరావు, టి.సత్యనారాయణ, జె.పార్థసారథి, వి.నాగమల్లేశ్వరరావు, ఎస్.కె.యాసిన్, హనుమానాయక్ పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమిని రూ.100 కోట్లకు అమ్ముకున్న ఎమ్మెల్యే

- మున్సిపల్ నిధులు కాజేసి హైదరాబాదులో మూడంతస్తుల భవనం
- అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధం : డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి - నరసరావుపేట

నియోజకవర్గ పరిధిలో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రూ.100 కోట్లకు ఎమ్మెల్యే అమ్ముకున్నారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపించారు. ఉప్పలపాడులో 200 ఎకరాల లేఅవుట్లో 46 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఒక్కొక్క ఎకరానికి రూ.ఐదు కోట్ల చొప్పున రియల్‌టర్ గోపిరెడ్డికి కప్పం చెల్లించారని అన్నారు. వైసిపి నేతలను సైతం కప్పం చెల్లించాలంటున్నారని, ఆయన ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కాదని, దోపిడీరెడ్డి శ్రీనివాసరెడ్డి అని ఎద్దేవ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నాయకులతో కలిసి అరవందిబాబు గురువారం విలేకర్లతో మాట్లాడారు. కరోనా సమయంలోను తోపుడు బండ్లు, చిరు వ్యాపారుల దగ్గర ఎమ్మెల్యే అనుచరులు వసూలు చేశారని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక వరకట్టకు చెందిన షేక్ పెద్ద బాజీ, ఇబ్రహీం, అలవాల గ్రామానికి చెందిన వెన్న బాలకోటిరెడ్డిని కిరాయి గుండాలతో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హత్య



డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న అరవిందబాబు

చేయించారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపించారు. ఎంతో మంది టిడిపి కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టారని, పార్టీ మారాలని చిత్రహింసలు పెట్టారని మండిపడ్డారు. టిడిపి అధికారంలోకి వచ్చాక వీటికి వడ్డీ సహా చెల్లిస్తామని హెచ్చరించారు. గంజాయి, గుట్కా, మట్కా, మద్యం, మట్టి, ఇసుక మాఫియాతో ఎమ్మెల్యే రూ.వేటకోట్లు సంపాదించారని, రేషన్ బియ్యాన్ని పందికొక్కుల్లా వైసిపి నాయకులు తినేశారని ఆరోపించారు. ప్రజలు కడుపు కట్టుకొని సంపాదించుకున్న డబ్బులను వడ్డీలకు ఇచ్చుకుంటే ప్రజల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్న వ్యక్తులు ఐపీలు పెట్టి గోపిరెడ్డికి కప్పం కట్టి ప్రజలకు కుచ్చు టోపీలు పెట్టారని అన్నారు. మున్సిపల్ నిధులను కాజేసి హైదరాబాదులో మూడు అంతస్తుల బిల్డింగ్‌ను ఎమ్మెల్యే కడుతున్నారని ఆరోపించారు. ఈ ఆరోపణలపై తాను బహిరంగ చర్చకు సిద్ధమని సవాలు విసిరారు.

పోలింగ్ కేంద్రాలను యథావిధిగా ఉంచాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చెప్పాడని పోలింగ్ కేంద్రాలను మార్చడం ఏకపక్ష నిర్ణయం తీసుకోవడం సరికాదని ప్రజల సౌకర్యార్థం పోలింగ్ బూతులు యథావిధిగా కొనసాగించాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి వినాయకంకు గురువారం ఫిర్యాదు చేశారు. పెట్లూరివారిపాలెం 223, 224, యల్లమందలో 232, రావిపాడులో 72 రొంపిచర్లలో 36, 37 పోలింగ్ కేంద్రాలను మార్చాలని ఎమ్మెల్యే ఆదేశం మేరకు మార్చారన్నారు. దీనిపై తాము ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా యథావిధిగా కొనసాగించకుంటే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.బ్రహ్మయ్య, బి.విశ్వేశ్వరరావు, పి.జగ్గయ్య, కె.సుబ్బారావు, జి.శేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధి చేసేవారినే ఎన్నుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఈపూరు

పేదల అభ్యున్నతే ధ్యేయంగా వైసిపి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని కొచ్చర్లలో అంగన్వాడి కేంద్రాలు, మినరల్ వాటర్ ప్లాంట్, సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వినుకొండకు ప్రధాన సమస్య అయిన తాగునీటి సమస్యను పరిష్కరించామన్నారు. సచివాలయాలు, ఆర్బీకేలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో గ్రామస్థాయిలో ప్రజల వద్దకు సేవలు చేరాయని చెప్పారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. గత టిడిపి పాలనలో నీరు-చెట్టు పథకాలతో రూ.కోట్లు దోచుకున్నారని, జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి అవినీతి పాలన చేశారని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వస్తే ఏ విధంగా దోచుకోవాలో ఇప్పటినుంచే ప్రణాళికలు రచిస్తున్నారని, అందుకే ప్రజలు అభ్యున్నతికి పాటుపడేవారిని ఎన్నుకోవాలని కోరారు. సర్పంచ్ కె.దేవరాజు, సిడిపిఒ బి.అరుణ, ఎంపిడిఒ ఎవి.రంగనాయకులు, పిఆర్ డిఇ కోటయ్య, ఎఒ రామారావు, వైసిపి నాయకులు బుచ్చయ్య, హనుమయ్య, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు

వ్యతిరేకతను గమనించే ఓటమి మాట : పుల్లారావు

ప్రజాశక్తి - చిలకలూరిపేట



నివురుగప్పిన నిప్పులా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను గమనించే జగన్ నోట ఓటమి మాటలు వస్తున్నాయనివ మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ వర్గాన్ని కదిలించినా జగన్ నిర్వాకాల్ని కథకథలుగా చెబుతుంటే, ఇంకా గెలుస్తానని అనుకోవడమే విడ్డూరమన్నారు. హామీల్లో 99 శాతం అమలు చేశామన్న జగన్ మాట ఈ శతాబ్దంలో అతిపెద్ద అబద్ధమని చెప్పారు. వైనాట్ 175 అన్న ఘీంకారాల నుంచి అభ్యర్థుల్ని వెదుక్కోవాల్సిన దుస్థితికి ఆ పార్టీ చేరిందని ఎద్దేవ చేశారు. తల్లిని, చెల్లిని ఇంటి నుంచి బయటకు పంపిన, సొంత బాబాయిని చంపిన నిందితుల్ని సంకలో పెట్టుకుని తిరుగుతున్న వ్యక్తిని ప్రజలు మళ్లీ నమ్మే ప్రసక్తే లేదన్నారు. వైసిపిలో మిగిలిన నాయకులు ఈ విషయాన్ని ఎంత త్వరగా అర్థం చేసుకుంటే వారికి అంత మంచిదని హితవు పలికారు.

ఎస్పీని కలిసిన నరసరావుపేట రూరల్ సిఐ



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా గుంటూరు నగరంపాలెం పోలీసుస్టేషన్‌లో పనిచేస్తూ నరసరావుపేట రూరల్ సిఐగా నియమితులైన కె.మల్లికార్జునరావు గురువారం నరసరావుపేటలోని జిల్లా పోలీసు కార్యాలయంలో పల్నాడు ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికలు రానున్న దృష్ట్యా విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని ఆయనకు ఎస్పీ సూచించారు.

జిల్లాలో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

ప్రజాశక్తి-తాడేపల్లి

జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని తాడేపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఓటర్ల ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ఓటు విలువ గురించి ఓటర్లకు తెలియజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎన్నికల నమోదు అధికారి లక్ష్మీకుమారి మాట్లాడుతూ ఓటు భారత రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి బి.శివారెడ్డి, బూత్ లెవెల్ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి పొన్నూరు రూరల్

ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణకు తోడ్పాటు ఇవ్వాలని పొన్నూరు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి వై హరిహర నాథ్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని స్థానిక కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపం నందు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. హరిహర నాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తద్వారా సరైన నేతలను ఎన్నుకోవచ్చునన్నారు. ఓటింగ్ ప్రక్రియలో అలసత్వం వహిస్తున్న ఓటర్లను ఉత్తేజపరిచేందుకు 2011 నుండి ఓటర్ల దినోత్సవం జరుపుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజెన్ లైన ఓటర్లను నూతనంగా నమోదు చేసుకున్న ఓటర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పొన్నూరు చేబ్రోలు పెదకాకాని తాసిల్దార్ లు శ్రీకాంత్ కేదార్నాథ్, కెవి గోపాలకష్ణ ,రత్న, డిటిఓ సాంబయ్య, బిఎల్వోలు ఓటర్లు ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. గురువారం స్థానిక కెఎల్ డీమ్డ్ యూనివర్శిటీలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయిన ఆమె విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. . యువత ఓటు హక్కు 2024 ఎన్నికల్లో దేశ భవిష్యత్తుని నిర్ణయిస్తుందన్నారు. యువతకు జాతీయ భావాలు ముఖ్యమన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ లో మొట్ట మొదటి సారి 1952లో ఎన్నికలు జరిగాయని గుర్తు చేశారు. అనంతరం ఆమె యూనివర్సిటీ లో జరుగుతున్న పరిశోధనలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా యూనివర్సిటీ లో నా ఇంక్యుబిలేటర్ ల్యాబ్ ను పురంధేశ్వరి పరిశీలించారు. కార్యక్రమంలో వర్శిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రొఫెసర్ వైస్ చాన్సులర్లు డాక్టర్ ఎవిఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్ రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరి మండలం నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థుల మానవహారం



తాడేపల్లి మండలం ఎస్ఆర్ఎంలో పురందేశ్వరికి సన్మానం



తాడేపల్లిలో ప్రతిజ్ఞ



పొన్నూరులో



పెదనందిపాడులో ప్రతిజ్ఞ



మంగళగిరిలో సీనియర్ ఓటర్లకు సన్మానం



కొల్లిపరలో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో జాతీయ సేవా పథకము, ఎస్ వి ఈ ఈ పి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవము పై గురువారము అవగాహన కార్యక్రమం జరిగినది. ఈ అవగాహన కార్యక్రమంకు నిర్మల ఫార్మసీ కళాశాల ఎస్ వి ఈ ఈ పి సూపర్వైజింగ్ ఆఫీసర్ సిహెచ్ సీతామహాలక్ష్మి, నోడల్ ఆఫీసర్ రెవరెండ్ సిస్టర్ జి నిర్మల జ్యోతి పాల్గొనీ మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి పాముల రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ కుటుంబంలో తమ గ్రామంలో ఓటు యొక్క ప్రాముఖ్యతను తెలియచేసి ఓటరు నమోదు కార్యక్రమమునకు సహకరించాలని కోరారు. సభా కార్యక్రమము అనంతరము విధ్యార్థులు మరియు అధ్యాపకులు జాతీయ ఓటరు దినోత్సవము పై ప్రజలకు అవగాహన కలగ చేయుట కొరకు ర్యాలీ చేశారు. ఆత్మకూరు హైవే సెంటర్ కు చేరుకొని మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ ఆఫీసర్ రేఖా నరేష్ బాబు, సమన్వయకర్త ఆర్ నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - చేబ్రోలు: జాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమాన్ని పొన్నూరు నియోజకవర్గస్థాయిలో ఘనంగా నిర్వహించా మని తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ తెలిపారు. ఈ సంద ర్భంగా ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి హరినాథ్, బిఎల్ఒల సూపర్వైజర్లు జిశ్రీనివాసరావు, ప్రవల్లికలకు అవార్డులను అందజేశారు.

ప్రజాశక్తి మంగళగిరి :ఓటు ద్వారా ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి కృషి చేయాలని మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మలా కుమార్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, మున్సిపల్ అధికారుల ద్వారా ప్రతిజ్ఞ చేయించారు. 80 సంవత్సరాలు పైబడిన వృద్ధ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కే హేమ మాలిని కార్పొరేషన్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి, పెదనందిపాడు

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పెదనందిపాడు మండల తహసిల్దార్ కార్యాలయంలో ఓటర్ల ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో తమశీల్దార్ షేక్ మహబూబ్ సుభాని, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ఓటు హక్కు వినియోగం, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎన్సిసి అధికారి పరిశా సర్దార్ పేర్కొన్నారు. కొత్తపేట శ్రీ రావి సాంబయ్య మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్సిసి అధికారులు ఓటు హక్కుపై సెమినార్ ఏర్పాటు చేశారు. 22వ బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టమెంట్ కల్నల్ జె మహేష్ అదేశాలమేరకు నిర్వహించిన సెమినార్ అనంతరం ఓటు హక్కు వినియోగంపై పట్టణంలో పలుచోట్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఐ స్టాఫ్ సుబేదార్ అమలూర్ సింగ్, అధ్యాపకులు బి శ్రీనివాస్, సిహెచ్ సుందరరావు పాఠశాల సిబ్బంది పాల్గున్నారు.

ప్రజాశక్తి- మేడికొండూరు

తహశీల్దార్ కార్యాలయంలో ఓటరు దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ శ్రీనివాస శర్మ ప్రసంగించారు. అనంతరం మండలంలో 80 సంవత్సరంలు దాటిన ఓటర్లను సన్మానించారు. కార్యక్రమ లో ఎంపీపీ యం.స్వప్న, డిప్యూటీ తాసిల్దార్ కె శ్రీనివాసరావు, ఎంపిడిఓ ప్రభాకర్ రావు, ఎంఈఓ యేసు రత్నం, జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జయప్రద పాల్గొన్నారు.

ప్రజాశక్తి మంగళగిరి : ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారత్ అని కేంద్ర ఆరోగ్యం కుటుంబం సంక్షేమ సహాయ మంత్రి భారతి ప్రవీణ్ పవర్ అన్నారు. గురువారం మంగళగిరి ఎయిమ్స్లో ని ఆడిటోరియంలో జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఆమె మెడికల్ విద్యార్థులను ఉద్దేశించి యువత ఓటర్లపైనే దేశ భవిష్యత్తు ఆధారాపడి ఉందని అన్నారు. యువత దేశం కోసం, రాష్ట్ర అభివద్ధి కోసం ఆలోచించి మంచి నాయకులను తమ ఓటు ద్వారా ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మంగళగిరి ఎయిమ్స్ అధ్యక్షులు టీఎస్ రవికుమార్, ఎయిమ్స్ అధికారులు, మెడికల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కొంతమంది విద్యార్థులకు ఓటర్ కార్డులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా శాలువాతో ఎయిమ్స్ అధికారులు కేంద్ర మంత్రిని సత్కరించారు.

ప్రజాశక్తి - కొల్లిపర : ఓటు కార్డుకు ఆధార్ నెంబర్ అనుసంధానం చేసినట్లయితే రాష్ట్రంలో తప్పులు లేని ఓటరు జాబితా తయారవుతుందని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. గురువారం జాతీయ ఓటర్ దినోత్సవం పురస్కరించుకొని తహశీల్దార్ నాంచారయ్య అధ్యక్షతన తాసిల్దార్ కార్యాలయం ఆవరణలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి ఆర్ఐ శ్రీనివాసరావు సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు ఆయన శాఖల అధికారులు పాల్గొన్నారు



తెనాలిలో

మంగళగిరి పట్టణ నూతన సిఐగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ



ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణ పోలీసు స్టేషన్ నూతన సర్కిల్ ఇన్స్పెక్టర్గా మర్రెడు శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన మల్లిఖార్జున రావు ను బాపట్ల జిల్లా బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సి.ఐ. శ్రీనివాసరావు గతంలో తెనాలి, బాపట్ల లలో పని చేసి ప్రస్తుతం గుంటూరు జిల్లా స్పెషల్ బ్రాంచ్ సి.ఐ.గా పని చేస్తూ మంగళగిరి పట్టణ సి.ఐ. గా బదిలి పై వచ్చారు. మంగళగిరి పట్టణ సిఐ గా బాధ్యతలు చేపట్టిన ఆయనకు స్టేషన్ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సబ్సిడీ రుణాలు



ప్రజాశక్తి- మంగళగిరి

మంగళగిరి ఏపీఐఐసీ బిల్డింగ్లోని రాష్ట్ర పరిశ్రమల కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిశ్రమల శాఖ అడిషనల్ కమిషనర్ ఏవీ పటేల్ ను గురువారం ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ అధ్యక్షులు బుల్లా రాజారావు కలిసి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని కోరుతూ వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బుల్లా మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు 45 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేసినందుకు కమిషనర్ పటేల్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలకు సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి ఎస్సీ ఎస్టీ పారిశ్రామికవేత్తలు ఆన్లైన్లో సబ్సిడీ రుణాలు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారన్నారు. సందర్భంగా అడిషనల్ కమిషనర్ ఏవీ పటేల్ ను బుల్లా శాలువాతో సత్క రించారు.



ప్రజాపాదయాత్రలో వాగ్దానాల వెల్లువ

ప్రజాశక్తి - కొల్లిపర

అవినీతి పాలన ప్రజా ధన దోపిడీయే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం పనిచేస్తుందని మాజీ మంత్రి టిడిపి నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు గురువారం ఆలపాటి చేపట్టిన ప్రజా పాదయాత్రలో భాగంగా మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వము అధికారంలోకి వస్తే దీపం పథకం లో భాగంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాతకు ఏటా రూ.20 వేలు, ఆడబిడ్డ నిధి పథకం కి రూపం 1500 పిల్లల చదువు కోసం తల్లివందనం పథకంలో భాగంగా రూ.15000 ఇస్తుందని తెలిపారు. దోపిడీ దగా కోరు ప్రభుత్వానికి చర్మ గీతం పాడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన తెలిపారు కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు భీమవరం చిన్న కోటిరెడ్డి వంగాసామిరెడ్డి ఆలవీరారెడ్డి కంచర్ల అమత రాజు, బొంతు చంద్రిక కొలిపర శ్రీను పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

14న శ్రీ భావనఋషిస్వామి కళ్యాణ మహోత్సవం

ప్రజాశక్తి మంగళగిరి

పాత మంగళగిరి పద్మశాలియ కళ్యాణ మండపంలో గురువారం ఫిబ్రవరి 14వ తేదీన పాత మంగళగిరి పద్మశాలియ బహుత్తమ సేవా సంఘం ఆధ్వర్యంలో కళ్యాణ మండపంలోని శ్రీ భద్రావతి సమేత భావనఋషిస్వామి కళ్యాణం మహోత్సవం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా గురువారం వివాహ ఆహ్వాన పత్రికలు, క్యాలెండర్లు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్ఆర్సీపీ నియోజకవర్గ ఇన్చార్జి గంజి చిరంజీవి కళ్యాణ మండపం అడహక్ కమిటీ మెంబర్ అండ్ టీడీపీ నేత నందం అబద్దయ్య, జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, సంఘం అధ్యక్ష కార్యదర్శులు వూట్ల సాంబశివరావు, ఎం వెంకటేశ్వరరావు తదితరులు ఆవిష్కరించారు.

ఎఎన్‌యు దూరవిద్య పరీక్షల షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం ఫిబ్రవరి, మార్చి నెలలలో నిర్వహించే పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. ఫిబ్రవరి 20వ తేదీ నుంచి అకడమిక్ ఇయర్ ఏ-21, ఏ -22, ఏ-23, క్యాలెండర్ ఇయర్ సి 21, సి -22, సి -23 లలో యుజి, పీజీ , డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సుల మొదటి, రెండవ సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని పరీక్షల డిప్యూటీ రిజిస్ట్రార్ సయాద్ జైనులబ్దిన్ తెలిపారు. 3వ, 4వ సెమిస్టర్ పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి జరుగుతాయని తెలిపారు. పరీక్షల ఫీజు చెల్లించేందుకు ఈనెల 27ఆఖరు తేదిగా నిర్ణ యించామని చెప్పారు. రూ.100 అపరాధం తో ఫిబ్రవరి 2లోగా చెల్లించాలని తెలిపారు.

చలపతిలో ముగిసిన వర్క్‌షాప్

ప్రజాశక్తి-గుంటూరు


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రామకృష్ణ

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో షార్మాన్యాటికల్ అనాలసిస్ విభాగం, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం మూడు రోజులపాటు 'ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ టెక్నిక్స్ ఇన్ డ్రగ్ డెవలం మెంట్ యూజింగ్ కంప్యూటేషనల్ మెథడ్స్' అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ఈ వర్క్‌షాప్‌నకు యూఎస్ జార్జ్ మాసన్ యూనివర్సిటీ న్యూరో సైన్స్ రీసెర్చ్ అసోసియేట్ యం.రామకృష్ణ హాజరై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కంప్యూటేషనల్ పద్ధతుల ద్వారా ఏదైనా ఔషధ ఆవిష్కరణలలో గణన పద్ధతులు, సమ్మేళనాలు పరీక్షించటానికి, మోడలింగ్ సిములేషన్, విజువలైజేషన్ పద్ధతుల ద్వారా సంభావ్య బైండర్‌లను నిర్ణయించటానికి ఉపయోగపడతుందని చెప్పారు. అంతే కాకుండా జంతు పరీక్షలు, క్లినికల్ ట్రయిల్స్‌లో ఉత్తీర్ణత సాధించిన తరువాత ఇన్ఫర్మేటిక్ టెక్నాలజిలు, గణన పద్ధతుల సహాయంతో స్ట్రక్చర్ బేస్డ్ డ్రగ్ డిజైన్ సహాయంతో సమర్ధవంతమైన పద్దతిలో వేగవంతం చేసింది అన్నారు. వర్క్‌షాప్ అనంతరం నిర్వహించిన పరీక్షలో 50 శాతంకుపైగా మార్కులు సాధించిన విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ముగింపు సందర్భంగా రామకృష్ణను ప్రిన్సిపాల్ రామారావు, చలపతి విద్యా సంస్థల చైర్మన్ వై.వి.ఆంజనేయులు సన్మానించారు.

ఆర్‌విఆర్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు



ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత అని ఆర్.వి.ఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాజ అభివద్ధిలో భాగస్వాములయ్యేందుకు ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ ఈ సందర్భంగా విద్యార్థులు, అధ్యాపక బందంచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఓటు ఆవశ్యకతను తెలిపే నినాదాలతో కూడిన ప్లకార్డులు చేతబట్టి కళాశాల కూడళ్లలో ర్యాలీని నిర్వహించారు.కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాల కష్ణ, కళాశాల ట్రెజరర్ డా.కొండబోలు కష్ణ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, డైరెక్టర్లు డాక్టర్ కె.రవీంద్ర, డాక్టర్ ఎన్.వి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేస్తున్న రామకృష్ణప్రభు, తదితరులు

చలమయ్య కాలేజీలో ముగిసిన పైథాన్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య డిగ్రీ కాలేజిలో గురువారం బి.కామ్ విద్యార్థులకు ప్రోగ్రామింగ్ ఇన్ పైథాన్‌పై శిక్షణా తరగతులు నిర్వహించి, విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కళాశాల సెక్రెటరీ కర్పూరపు రామకృష్ణప్రభు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాశాల ప్రెసిడెంట్ పి.రాఘవరావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు. విద్యార్థులు నేటి అధునాత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పుటికప్పుడు తెలుసుకుంటూ అందిపుచ్చుకోవాలని సూచించారు. రిసోర్స్‌పర్సన్లు శ్రీనివాస్, అవేష్ గోపాల్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, కోశాధికారి జయప్రకాష్, జూనియర్ కాలేజి ఇన్‌చార్జి సుభద్ర, హైస్కూల్ హెచ్.ఎం.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లు ప్రలోభాలకు గురికావొద్దు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారధి

ప్రజాశక్తి-గుంటూరు


యువ ఓటర్లకు ఎపిక్ కార్డులు ఇస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, కలెక్టర్ తదితరులు

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత దేశంలో ఓటు హక్కును రాజ్యాంగం మనకు ఉచితంగా ఇచ్చిన హక్కుగా భావించకుండా, డబ్బు, ప్రలోభాలకు లోను కాకుండా ఆలోచించి ఓటు హక్కును విని యోగించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి అన్నారు. బుధ వారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఎస్ఆర్ శంకరన్ హాలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి, డిఆర్‌ఓ కె.చంద్రశేఖరరావు, ఆర్డిఓ పి.శ్రీఖర్, జిఎంసి అడిషనల్ కమిషనర్ లక్ష్మీ శివజ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకొని ఓటింగ్ సందర్భంలో తప్పక తమ ఓటును వేయా లన్నారు. ఇటీవల జరిగిన ఓటరు నమోదు కార్యక్రమంలో ఎక్కువ మంది యువత నమోదు అయ్యారని, వారంతా తమ ఓటును సద్వినియోగపరచాలన్నారు. కలెక్టర్ మాట్లాడు తూ ప్రపంచంలోనే భారత దేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అన్నారు.ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.కొన్ని కారణాల వల్ల కొంతమంది ఓటరు జాబితాలో ఎన్రోల్ కాకుండా ఉండడం, కొంతమంది ఎన్రోల్ అయినప్పటికీ ఓటు వేయకపోవడం సరికాదన్నారు. అక్టోబరులో డ్రాఫ్ట్ రోల్‌లో యువత 14వేల మంది ఉండగా, తర్వాత చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల ద్వారా 35వేలకు చేరిందన్నారు. 14వేల మంది దివ్యాంగులు, 33వేలకుపైగా వృద్ధ ఓటర్లు ఉన్నారని, వీరు ఇంటి వద్దే ఓటు వేసేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సందర్భంగా జేసీ జి.రాజ కుమారి అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీనియర్ సిజిటన్ ఓటర్లను సన్మానించారు. స్వీప్ కార్యక్రమాలు నిర్వహించిన విద్యా సంస్థల ప్రతినిధులను, విధుల్లో ప్రతిభ చూపిన సూపర్వైజర్లు, బీఎల్వోలకు మెమోంటోలు, ప్రసంశ పత్రాలు అందించారు. నూతనంగా ఓటర్లుగా నమోదైన యువతకు ఎపిక్ కార్డులు అందించారు, జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యాసంస్థల్లో నిర్వహించిన వివిధ పోటీలల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. సభకు ముందు జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటర్లకు అవగాహన కోసం రూపొందించిన శకటాన్ని, ర్యాలీని కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ ఇతర అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.స్వాతి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పైపులైన్ల మరమ్మతులకు ప్రత్యేక కార్యాచరణ : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు


పైపులైను మరమ్మతు పనులు పరిశీలిస్తున్న కమిషనర్

రానున్న వేసవి దృష్ట్యా నగరంలోని తాగునీటి ప్రధాన పైప్‌లైన్‌ల మరమ్మతులు అధిక ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం బి.ఆర్.స్టేడియం రిజర్వాయర్ వద్ద జరుగుతున్న పైప్‌లైన్ లీకు మరమ్మతు పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించి, పనుల వేగవంతంపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా ఇప్పటినుండే ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. ప్రధాన పైప్‌లైన్‌లను ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి, మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టడానికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఎస్.ఈ.ని ఆదేశించారు. పైప్ లైన్ మరమ్మతు పనులను తాత్కాలికంగా కాకుండా శాశ్వతప్రాతిపదికన సమస్య పునరావతం కాకుండా చేయాలని ఆదేశించారు. బిఆర్ స్టేడియం రిజర్వాయర్ వద్ద పంపింగ్ పైప్‌లైన్‌పై అనేకసార్లు లీకులు ఏర్పడి తాగునీరు వృధా అవుతుందని, అలాగే ప్రధానమైన పొన్నూరు రోడ్డుపై రాకపోకలకు సమస్యగా ఉన్నందున మరమ్మతు పనులను శాశ్వత ప్రాతిపదికన చేపడుతున్నామని చెప్పారు. పాత ఆర్.సి.సి. పైప్‌ల స్థానంలో ఎంఎస్ పైప్‌లను ఏర్పాటు చేస్తున్నామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌కి స్పష్టం చేశారు. పనులను గురువారం సాయంత్రానికి పూర్తి చేసి శుక్రవారం నుండి యధావిధిగా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, పనులను ఇంజినీరింగ్ అధికారులు నేరుగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. పర్యటనలో ఎస్.ఈ (ఎఫ్ఏసి) సుందర్రామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, డిఈఈ శ్రీధర్, ఏఈ సునీల్‌కుమార్, వైసిపి నాయకులు నూరి ఫాతిమా, కార్పొరేటర్ ఆబీద్ బాష పాల్గొన్నారు.

నేటి నుంచి గుంటూరులో ప్రాపర్టీ షో

గుంటూరులో మూడు రోజుల పాటు నిర్వహణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో జనవరి 26, 27, 28 తేదీల్లో స్థానిక సిద్ధార్థ గార్డెన్స్‌లో ప్రాపర్టీ షో నిర్వహించనున్నట్టు క్రెడాయ్ రాష్ట్ర చైర్మన్ ఆళ్ల శివారెడ్డి తెలిపారు. గుజ్జనగుండ్లలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము, కార్యదర్శి తియ్యగూర వినోద్ రెడ్డితో కలిసి ప్రాపర్టీ షో బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లో ప్రతి ఏటా ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వివిధ సంస్థలకు చెందిన హౌసింగ్ ప్రాజెక్టులలో నాణ్యమైన అపార్టుమెంట్స్‌ను , ఇళ్ల స్థలాలను కస్టమర్లు పొందటానికి అవకాశం ఉంటుందన్నారు. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము మాట్లాడుతూ 7వ ప్రాపర్టీ ఎక్స్‌పో మూడు రోజుల పాటు గుంటూరులోని సిద్ధార్థ కల్యాణ్‌మండపంలో జరుగుతుంద న్నారు. ప్రతి ఒక్కరూ సొంత ఇంటి కల నెరవేర్చుకోవడానికి ఉపయోపడే సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. ప్రాపర్టీ షోలో అన్ని వర్గాల వారికి గృహ రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు వస్తున్నారని తెలిపారు. వ్యవసాయ రంగం తరువాత నిర్మాణ రంగం లోనే ఎక్కువ మంది కార్మికులకు ఉపాధి దొరుకు తుందన్నారు. మునిసిపల్ మంత్రి ఆదిమూలపు సురేష్, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైద్య మంత్రి విడదల రజినీ, నగరంలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్, డిప్యూటీమేయర్లు, బ్యాంకు ఉన్నతాధి కారులు హాజరు అవుతారని తెలిపారు. వివిధ రంగాలకు 80 స్టాల్స్ ఏర్పాటు అవుతాయ న్నారు. ఈ కార్యక్రమంలో క్రిడాయ్ గుంటూరు వైస్ ప్రెసిడెంట్ మెట్టుసాంబశివారెడ్డి, జాయింట్ సెక్రటరీ శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

